


ఊళ్ళో సంబరాలు జరుగుతున్నాయి. ఊరుచివర అమ్మవారికి ప్రతిఏటా జాతర చేస్తారు. ఈసారి మరింత ఉత్సాహంతో జాతర చేస్తున్నారు. ఊళ్ళో ప్రజలు స్తోమతుకు తగ్గట్టు అమ్మవారికి పూజలు జరిపిస్తున్నారు. ఊరంతా ఆ వేడుకలోనే ఉంది. ఆ సంబరం ప్రతి ముఖంలోనూ కనిపిస్తోంది,

సావిత్రికి మాత్రం దిగులుగా వుంది. విచారంగా వుంది. దుఃఖంతో మనసు మెలికలు తిరిగిపోతోంది. అమ్మవారి గుళ్ళో కోడిని బలి యిస్తుంటె బాధతో అరిచే దాని గొంతులా సావిత్రి గొంతు విలవిలలాడిపోతోంది. తల మొండెం వేరై కోడి గిలగిల కొట్టుకుంటున్నట్లు సావిత్రి గుండె బాధతో భయంతో చేతకాని తనంతో అరుస్తోంది.

సావిత్రి అప్పలకొండను మనసారా యిష్టపడింది. తన ప్రాణంలో ప్రాణం అనుకుంది. అప్పలకొండ తోడుంటే తినకింకేమీ అక్కర్లేదనుకుంది. అలాంటి సావిత్రిని మోసం చేసాడు అప్పలకొండ. 'నా బ్రతుకు బండిని బురదలోకి తోసేడు' అని బాధపడింది సావిత్రి. ఆమె మానాన్ని దోచుకున్నాడు అప్పలకొండ. ఆమె శీలాన్ని నాశనం చేసాడు.

సావిత్రికి నాఅన్న వాళ్ళెవరూ లేరు. వున్నతల్లి రెండేళ్ళ క్రితమే పోయింది. పోతూపోతూ తను అంట్లుతోమి పాచిపనిచేసే ఇళ్ళన్నీ సావిత్రికి బ్రతుకు తెరువుగా చూపించిపోయింది. అప్పట్నుంచీ తన వయసునీ, శరీరాన్నీ, అందాన్నీ తగు ఒద్దికలో పెట్టి జాగ్రత్తలో వుంటోంది సావిత్రి. ఆర్నెల్ల క్రితం అప్పలకొండ పరిచయం అయ్యేడు. సావిత్రి గుడిసెకు ఎదురుగా వున్న రాములోరి గుడి దగ్గర అప్పలకొండ కొబ్బరికాయలు అమ్మేవాడు. ఇంటిముందు కనబడే మనిషేమో చూపు చూపు కలుసుకున్నాయి. నవ్వితే నవ్వాలనిపించేది. మాటలు ఎలా కలిశాయో! ఒకరినొకరు విడిచి వుండలేనంత దగ్గిరయ్యారు.

ఒకసారి అప్పలకొండ అన్నాడు —

''ఓయ్. సాయిత్రీ నువ్వు నా జిలేబీ కూనవే. రాములోరి గుళ్ళో సీతమ్మోర్లా నీ రూపం ఎలిగిపోతావుంటదే. అదేటో పిసరంత చ్చనం నువ్వగపడకపోతే నేన్సచ్చిపోతానేట్రో దేవుడో అని బయం పుట్టుకొస్తాదే.''

సావిత్రి ఆ మాటలకు మురిసిపోయేది. తనంటే అంతిదిగా యిష్టపడే మగాడు దొరికినందుకు పరవశించేది.

''నీకే అలావుంటే నిన్నే నమ్ముకున్న కుర్ర మనసు నాది. నాకెట్టావుంటుంది. నిన్నొదిసి వుండలేను కొండా'' అనేది సావిత్రి.

''ఓస్ నీ సోకు సంతకెల్ల. మాటల్తో కూడా నా మనసు పల్టీ కొట్టించెత్తున్నావుగదే'' అనేవాడు అప్పలకొండ.

''నాయేం మాటలు వుత్తి ఎర్రి మాటలు కాని. నువ్వే ... నీ సూపుల్తోటీ, మాటల్తోటీ, ప్రేమతోటీ మహాచోద్యం సూపిత్తున్నావులే'' అనేది సావిత్రి.

అప్పలకొండా, సావిత్రీ అంతిదిగా వుండేవారు. పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. కానీ రెండుమూణ్ణెల్ల వరకూ ముహూర్తాలు లేవని అప్పలకొండ చెప్పేదు. రెండు నెల్లంటే ఎంతసేపులే అనుకుంది సావిత్రి. ఈలోగా అప్పలకొండ ఇలా మోసం చేస్తాడనుకోలేదు.

నాల్రోజుల క్రితం ఓ రాత్రి అప్పలకొండ తాగొచ్చి రాములోరి గుడి మంటపం మీద పడుకున్నాడు. నిషా తలకెక్కి నోటికొచ్చినట్లు మాట్లాడుతుంటే సావిత్రి విని భరించలేక తన గుడిసెలోకి తీసుకొచ్చి పడుకో బెట్టింది. అప్పుడే అప్పలకొండ సావిత్రిని కావాలన్నాడు. ''నువ్వొప్పుకోకపోతే సచ్చిపోతానే సాయిత్రి'' అన్నాడు. 'పెళ్ళికాకపోతేనేమి, మనువాడే వోడే కదా' అనుకుంది. తనకు అన్యాయం చేయ్యడనుకుంది. 'ఆడ్ని అంతగా అభిమానించే దాన్నైతే ఆడి కోరిక తీర్చడం సబబే' అనుకుంది. అప్పలకొండ పక్కకు చేరింది.

తెల్లవారింది. అప్పలకొండకి రాత్రి తలకెక్కిన నిషా దిగింది. తన కోరికా తీరింది.

''నీకూ నాకూ సంబంధం లేదే సాయిత్రి'' అన్నాడు పొద్దున్నే.

''ఇదేట్రా కొండా ఆ మాటలు'' అంది సాయిత్రి దెబ్బతిన్న పక్షిలా.

''నిన్ను పొందాలనుకున్నాను. పొందేను. బలవంతం సేత్తే నువ్వు అల్లరైపోతావే. నేనూ అల్లరైపోతాను. రాజకీయం తెల్సినోడు ఇలాగే పొందాలే ఆడదాన్ని'' అన్నాడు.

'నన్నన్నేయింసేత్తావా. మనసిచ్చిందాన్నే. నిన్నే నమ్ముకున్నదాన్నే. ఏటా మాటలు, సాల్లే'' అంది సాయిత్రి.

''ఓసోస్, ఇదో పెద్ద అందగత్తెండి. దీనిని తాళికట్టాలటంది. ఓస్, నువ్వు సాయిత్రివే గాని నేను సత్యవంతున్ని గాదు. నా పేరప్పలకొండ. నిషా దిగిపోయినాక సెప్తన్నాను. నీకూ నాకూ ఇక ఎలాంటి సంబంధమూ వుండదు.'' అప్పలకొండ బయిటకు వెళ్ళడానికి లేచాడు. సాయిత్రి వెక్కుతూ కాళ్ళకు అడ్డం పడింది.

''ఎందుకేడుస్తావే జిలేబి కూనా. నా పద్దతే అది. పొగడ్తకి లొంగని ఆడదెవతుంటదే. అందుకే నిన్ను పొగిడేను. ఉబ్బిపోయావు. లైన్లో పడ్డావు. నా అవుసరం తీరింది. నా డూటీ ఐపోయింది'' అన్నాడు అప్పలకొండ. ఇంకా చాలా అన్నాడు.

''మన సంగతి ఎవరితోనైనా చెబ్తే నువ్వే మంచిదానివి కాదని చెబుతా. చప్పుడు చెయ్యక ఊరుకో. ఎవుడైనా పెళ్ళిచేసుకుంటాడు. నేను మగాణ్ణే నాకేటి' అన్నాడు. వెకిలిగా నవ్వేడు. సావిత్రిని ఒక్క తన్ను తన్ని మరీ బైటకు నడిచాడు !

అప్పలకొండచేసిన మోసం సావిత్రిని పిచ్చిదాన్ని చేసింది. అయోమయంలో పడేసింది. ఎంతగానో అభిమానిస్తే దానికి ప్రయోజనం బ్రతుకుమసైపోవటమేనా ? ఇప్పుడేటి సెయ్యటం? సావిత్రి విలవిలలాడిపోతోంది.

ఇంతలో తలుపు కొట్టిన చప్పుడైంది. తలుపు తీసింది సావిత్రి. పక్కింటి అమ్మాజి. రెండేళ్ళ కూతుర్ని ఎత్తుకొని నిలబడివుంది.

''ఏంటే'' అంది సావిత్రి.

''సంబరాని కెల్తున్నాను వస్తావు'' అడిగింది అమ్మాజి.

''నేన్రానే. నాకొంట్లో బాగుండలేదు'' దిగులుగా అంది సావిత్రి.

''నువ్వో వస్తావనుకున్నాను. సంబరంలో పచ్చబొట్టు పొడిచేవాళ్ళున్నారంట. మా అమ్మాయి చేతిమీద పచ్చబొట్టుతో పేరు రాయిద్దామనుంది నువ్వో వస్తానంటే రా'' అంది అమ్మాజి.

''అంత చిన్న పిల్లకు పచ్చబొట్టు పొడిపిస్తావంటే! నొప్పి సెయ్యదా? ఏడవదా'' అంది సావిత్రి.

''ఏమంత నొప్పి సెయ్యదనుకో, నువ్వో తోడుంటే బాగుంటదని.''

''సరే వస్తాలే. నువ్వు ముందెల్లి గుడిదగ్గరుండు'' అంది సావిత్రి. అమ్మాజి వెళ్ళిపోయింది.

సావిత్రి మళ్ళీ తన ఆలోచనల్లోకి వచ్చింది. ఏం చెయ్యాలి ? అప్పలకొండని నమ్ముకొని తనే అన్యాయంగా బలైపోయింది. ఆడు మాత్రం కులాసాగా తిరిగేస్తున్నాడు. ఆడ్ని నమ్ముకున్నందుకిదా శిక్ష? నిజమే, మగాడ్ని తొందరగా నమ్మకూడదు. నట్టేట్లో ముంచేస్తాడు. కానీ ఇప్పుడేటి సెయ్యడం ? అప్పలకొండ పెళ్ళి సేసుకోననేశాడు రెండు మూడ్రోజుల్లో ఈ వూర్నించే వెళ్ళిపోతాడని తెలిసింది. తను పాడైపోయిందని ఎవరికీ తెలీదు. ఎలాగో బాధపడూ బతుకు గడిపేస్తాది. కానీ ఆడు ఇంకెంతమందిని ఇలా మోసం సేస్తాడో?! ఏటి సెయ్యాలి?

సావిత్రి ఇదివరకు అప్పుడప్పుడు సినిమాలు సూసేది. ఈమధ్యచూడ్డంమానేసింది.''సినిమాల్లో ఏటున్నాయి. ఓ ఆడకూతుర్ని ఓ మగోడు బలాత్కారం సెయ్యటం, ఆడు కులాసాగా ఎల్లిపోడం,




అనక ఈ ఆడకూతురు బోరున ఏడవడం, తర్వాత నూతిలో పడో, ఉరేసుకునో, గన్నేరుకాయలు తినో సచ్చిపోవడం. ప్రతి సినిమాలో ఇయ్యి తప్పనిసరిగా వుంటాయి. ఆడది పవిత్రమైనదని, దాన్ని పాడుచెయ్యడం తప్పనీ, అభిమానం గల ఆడది తన కన్నేయం జరిగితే బరించలేదనీ, మరో మగోడితో తన ఎంగిలి శరీరాన్ని పంచుకోలేక ఆత్మహత్య చేసుకుంటుందన్నట్లు సూపిత్తారు. ఆడది బలాత్కరింపబడితే అది వెంటనే సచ్చిపోవాలి. కానీ బలాత్కరించినోడు మాత్రం ఓ చమాపన కోరి సుఖంగ బతికెయ్యొచ్చు, సమాజపు కట్టుబాట్లు అందరికీ సమానంగా వుండాలికానీ మగోడికా స్వతంత్రవేటి, ఆడదానికీ అన్నాయిమేటి? అప్పుడప్పుడు ఎదవాలోచ నొకటొచ్చేది. సినిమాల్లో ఆడోల్లకి అన్యాయిం జరిగినట్టు తనకు జరిగితే తను బలవంతంగా సచ్చిపోకూడదు. మగాళ్ళకి బుద్ధిచెప్పి గడ్డి తినిపించా లనుకొనేది? కానీ అప్పలకొండ తన కన్యాయం సేసేడు. లోకంలో శానామంది ఇలాగే బతుకు బుగ్గి సేసుకుంటున్నారు. లోకంలో ఎన్ని మానభంగాలు జరగట్లేదు. దేవుళ్ళు మనిషిగా పుట్టిన ఈ లోకంలోనే ఆడదాని శీలానికి రక్షణ లేదు. ఇక మిగతా లోకాల్లో ఎలా వుంటాదో!

'నా శీలం సెడిపోయింది. నా బతుకు నిప్పలకుంపటైపోయింది. కానీ అప్పలకొండ కులాసాగా తిరిగేస్తున్నాడు. ఆడికి శీలం లేదా? ఒక్క ఆడదానికేనా శీలవతిగా, పవిత్రురాలిగా వుండాలనే కట్టుబాటు! అప్పలకొండని ఎలాగైనా దెబ్బ కొట్టాలి. ఆడు తప్పుచేసాడని పదిమందికీ తెలియాలి. ఆడికి శిచ్చ ఏయించాలి. లోకంలో ఇక ఏ మగోడూ ఇలాంటి ఎధవ పని సెయ్యకుండా సెయ్యాలి. కానీ అది సాధ్యమా!?

సావిత్రి హృదయం మరణయాతన పడుతోంది. అంతలోనే ఏదో ఆలోచన.

'అవును అట్టానే సెయ్యాలి. అప్పలకొండని శిచ్చించాలి. నేను శారీరకంగా శీలంలేని దాన్నయినా నాకన్యాయం చేసినోడ్ని శిచ్చించే శీలం వుంది నాకు.

అవును. నాకు 'శిక్షించే శీలం' వుంది. అవును నాకిప్పుడనిపిస్తోంది. ఆడదానికి మగోడ్ని శిచ్చించే శీలం వుండాలి.

ఒక్కక్షణం ఆలోచించింది సావిత్రి. సంబరానికి బయలుదేరి వెళ్ళింది. సంబరంలో అప్పలకొండ కనిపించేడు. వోరగా చూసి నవ్వింది. "ఇయ్యాల సంబరం కొండా! రాత్రికి మా యింటికొచ్చెయ్" అంది సావిత్రి. అలాగే అన్నాడు అప్పలకొండ మరోసారి సావిత్రి దక్కుతుందన్న ఆశతో.

అమ్మోరి గుడి దగ్గరికెళ్ళింది. అమ్మాజీని కలుసుకుంది. ఇద్దరూ కలిసి పచ్చబొట్టు పొడిచే ఎరుకలమ్మ దగ్గరికెళ్ళేరు. అమ్మాజి కూతురికి పచ్చబొట్టు పొడిపించేరు.

"ఎరుకలమ్మీ! ఇయ్యాల సంబరం కదా! రాత్రికి మా యింటికి భోజనానికి రా" అని పిల్చింది సావిత్రి.

రాత్రి ఎరుకలమ్మ సావిత్రి ఇంటికొచ్చింది. కడుపునిండా తిండి పెట్టింది సావిత్రి.

అప్పుడు చెప్పింది సావిత్రి అప్పలకొండ తనకు చేసిన అన్యాయం గురించి.

"ఎరుకలమ్మా. ఆడిమీద నాకు కచ్చగా వుంది. మగోడి విరవీగేతనం అణగ్గొట్టాలనుంది. దానికి నేనొకటిసేత్తాను" అంది సావిత్రి తను చెయ్యబోయే పని గురించి చెబ్తూ.

సావిత్రికి జరిగిన అన్యాయం విని ఎరుకలమ్మ బాధ పడింది. సావిత్రి చేయబోయే పనిని మెచ్చుకుంది.

"ఆడు తాగుబోతు అనంటివిగా. ఈ రాత్రికి ఆడికి ఫుల్లుగా మందు కొట్టించి. మిగతా పని నేన్చూసుకుంటా" అంది ఎరుకలమ్మ.

అప్పలకొండ వచ్చేడు. నిషామీదున్నాడు. సావిత్రి కూడా మరికాస్త మందు పట్టించింది. ఆనందంతో అది కూడా తాగి మత్తుగా పడుకున్నాడు అప్పలకొండ. ఎరుకలమ్మ పని పూర్తి చేసింది. ఆ రాత్రి ఎరుకలమ్మ వెళ్ళిపోయింది

మర్నాడు.

సూర్యుడింకా తూర్పున రాలేదు. తన వెలుగు ఛాయల్ని అప్పుడే పంపిస్తున్నాడు భూమ్మీదకి.

సావిత్రి అప్పటికే లేచింది. దగ్గరలోనే వున్న పట్నం వెళ్ళడానికి నిశ్చయించుకుంది. ఇంకా లేవని అప్పలకొండ ముఖంలోకి చూసింది.

'కొండా! నువ్వు మంచి మనిషివని నమ్మి బలైపోయాను. నీలాంటి వాడికి నాలాంటి ఆడదుండాల్సిందే. నాలాంటి ప్రతి ఆడది నేను నీకు ఇదించిన శిక్షలాంటిది ఇదించే శిచ్చించే శీలం వున్న మనసుతో బతికితే ఇక నీలాంటి వాళ్ళు పుట్టరు!' అనుకుంది మూగగా.

మరుక్షణం బస్‌స్టాండ్‌కి నడిచింది పట్నం పోయే బస్ ఎక్కేందుకు, మరోచోట మనశ్శాంతిగా బతికేందుకు.

సూర్యుడు పూర్తిగా ఊళ్ళోకొచ్చేడు. అప్పటికి అప్పలకొండకి మెలకువ వచ్చింది. సావిత్రి కనబడక పోయేసరికి లేచి రాములోరి గుడిదగ్గరి కొచ్చేడు.

దారినపోయే జనం అప్పలకొండవైపు వింతగా చూడసాగేరు. అప్పలకొండ ముఖంలో దయ్యాన్ని చూసినట్లు బెదిరిపోసాగేరు. అటుపక్క నడుస్తున్న కాస్త అక్షరజ్ఞానం వున్న ఆడవాళ్ళు అప్పలకొండ ముఖంలోకి చూసి భయంతో పరుగులు పెడుతున్నారు.

అప్పలకొండ చుట్టూ జనం మూగేరు. కాస్త మీసాల్తిరిగిన కుర్రాళ్ళు అప్పలకొండను నిలదీసేరు.

"ఏంరా నువ్వు సేసిన పని" చుట్టూ జనంలోంచి అన్నారెవరో.

"రాత్రెక్కడున్నావు, ఏం చేసావు" అంటూ ప్రశ్నించారు.

మొదట అర్థం కాలేదు అప్పలకొండకి. తరువాత అర్థమైంది. తన ముఖంలో కనబడుతున్న వింతని మాటల్లో వినేసరికి చెమటలు పట్టేయి అప్పలకొండకి. తను చేసిన పొరపాటు అర్థమైంది. అందరిముందూ అవమానంతో తలదించుకున్నాడు. నోట మాట రాలేదు. 'ఎలా దీన్ని సహించడం.'

సావిత్రి ఎంత శిక్ష విధించింది. ఈ శిక్షకు కారణం చెప్తే ఈ జనం తనను బ్రతకనివ్వరు. అసలు తనకిక బ్రతుకే లేదేమో! అవును. అవమానంతో తను బ్రతకలేడు. ఇక్కడే కాదు. ఎక్కడికెళ్ళినా మనకిక అవమానమే. జీవితాంతం వరకూ తనకీ పరాభవం తప్పదు. దీనికన్నా చావడంనయం. ఈ జనం మధ్య తను ఇక బ్రతకలేడు. తను చచ్చిపోవడం ఒక్కటె సావిత్రి విధించిన శిక్షకు పరిష్కారం.

అవును తను చచ్చిపోవాలి!

అప్పలకొండ ఊరు చివర ఏటి గట్టుకి నడిచాడు. 'నన్ను క్షమించు సావిత్రీ!' అని సావిత్రికి దండం పెట్టుకున్నాడు. అమాంతం ఏట్లోకి దూకేడు.

ఆ సాయంత్రానికి అప్పలకొండ శవం తేలింది ఏట్లో. అప్పలకొండ శవం నుదుట పచ్చబొట్టుతో రాసిన అక్షరాలు అందరి దృష్టిలో పడుతున్నాయి.

"ఈడు నన్ను సెరిసాడు" ఈ అక్షరాలు, అప్పలకొండ శవం నుదుట చదువుకొని శవాన్ని చూడ్డానికి వచ్చిన వాళ్ళందరూ మౌనంగా వెళ్ళిపోతున్నారు. ★